క్లుప్తంగా

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో సర్వే నెంబర్ 15, 16, సీతారాంపురం పరిధిలోని లింగగిరి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 84 లలో ప్రభుత్వం సేకరించిన ఇళ్ల స్థలాల కోసం అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వజ్రాల జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెంది ఉండి, తెల్లరేషన్ కార్డు ఉన్న వారు జూన్ 1 నుంచి జూన్ 3వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల వరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

భోజనశాల నిర్మాణ పనులు ప్రారంభం


సాయిబాబా మందిరంలో భోజనశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దాతలు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో దాతల సహకారంతో నిర్మించనున్న భోజనశాల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, బుస్సా మహేష్, పసుపులేటి భిక్షం, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర

కోదాడరూరల్ : ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో ఒక అర ఎకరంలో వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ప్రకృతి వ్యవసాయం చేయాలని సామాజిక కార్యకర్త ఎం.గోపయ్య కోరారు. గురువారం మండల పరిధిలోని దోరకుంట, చిమిర్యాల, మంగళితండా, నల్లబండగూడెం, రెడ్లకుంట, కూచిపూడి తండా, గణపవరం, తొగర్రాయి గ్రామాలలో గోపయ్య స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా సహజసిద్ధమైన వ్యవసాయం చేయాలని కోరారు.. భూసారం పెరిగేందుకు, చీడ, పీడల నివారణను సహజసిద్ధంగా నివారించే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

5న కలెక్టరేట్ ముట్టడి


బృందావనపురంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాములు

నడిగూడెం : ఉపాధి హామీ పథకం రక్షణ కోసం ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని బృందావనపురంలో నిర్వహించిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సోంపంగు జానయ్య, కాసాని కిషోర్, అనంతుల మురళి, లింగస్వామి, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

మునగాల : మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ దస్తగిరి, కోల ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి స్థలం మంజూరుకు ప్రయత్నిస్తానని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పనస పెద్ద శ్రీను, జానీపాషా, అయ్యన్న, షబ్బీరు, సోంపంగు రేణుక, వీరబాబు, ఎల్లయ్య, రాజు, బాల ఉపేందర్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై నేడు సమావేశం

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై నియోజకవర్గ స్థాయి సమావేశం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

అధ్వానంగా సాగర్ కాల్వలు

- దెబ్బతిన్న ప్రధాన కాల్వ లైనింగ్
- పూడిపోయి, కంపచెట్లమయంగా మారిన మేజర్ కాల్వలు
- చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులు


రామాపురం సమీపాన దెబ్బతిన్న సాగర్ ఎడమ కాల్వ లైనింగ్

నడిగూడెం : మండల పరిధిలోని సాగర్ ఎడమ కాలవ్వతో పాటు కాల్వకు అనుసంధానంగా ఉన్న మేజర్ కాల్వలు అధ్వానంగా మారాయి. కోట్ల రూపాయలతో కాల్వల ఆధునీకరణ పనులు చేసినా చివరి భూములకు నీరందడం లేదు. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, కంపచెట్లు పెరిగి, పూడడంతో నీరు వెళ్లక చివరి భూములకు నీరందడం లేదు. కృష్ణానగర్ డీప్ కట్ నుంచి రామాపురం, చాకిరాల వరకు, సిరిపురం నుంచి కాగితరామచంద్రాపురం వరకు సాగర్ ఎడమ కాల్వ లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. పలు చోట్ల కాల్వకట్టలకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. అలాగే రామాపురం, సిరిపురం డీప్ కట్ సమీపాన కాల్వ కట్టలు నెర్రెలు బారాయి. దీంతో గండ్లు పడే ప్రమాదమున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ప్రత్యేక నిధులతో రామాపురం వద్ద కాల్వ కట్టను తొలగించి మట్టితో కట్టకు మరమ్మతులు చేపట్టారు. చేసిన పనులు నాసిరకంగా ఉండడంతో కాల్వ కట్ట మళ్లీ నెర్రెలు బారింది.


కాగితరామచంద్రాపురం యూటీ వద్ద చేపడుతున్న పూడికతీత పనులు

చివరి భూములకు అందని నీరు

సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న కొమరబండ, కొత్తగూడెం, పాలారం మేజరు కాల్వలు అధ్వానంగా మారాయి. ఈ మేజరు కాల్వల ద్వారా రామాపురం, చాకిరాల, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి, కొమరబండ, శ్రీరంగాపురం, రత్నవరం, వాయిలసింగారం, వసంతాపురం, తెల్లబండతండా, అమీనాబాద్, త్రిపురవరం, గోల్‌తండా, అనంతగిరి, మొగలాయికోట, శాంతినగర్, గోండ్రియాల, కొత్తగూడెం, సిరిపురం, వల్లాపురం, చనుపల్లి, పాలారం గ్రామాలకు సాగు నీరందే విధంగా నాడు మేజర్, మైనర్ కాల్వలు ఏర్పాటు చేశారు. ఈ మూడు మేజర్ల కింద దాదాపు 50 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నది. కాల్వల్లో మట్టి పేరుకపోవడం, నాచు పెరగడం, కంపచెట్లు పెరగడంతో పాటు అనేక చోట్ల లైనింగ్ లేకపోవడం, పలు చోట్ల చేసిన పనులు నాసిరకంగా చేయడంతో చివరి భూములకు నీరందడంలేదు. మేజరు, మైనరు కాల్వలకు పలు చోట్ల షెట్టర్లు బిగించలేదు. దీంతో చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి చివరి భూములకు సాగు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

అత్యవసర పనులు ప్రారంభం

సాగర్ ఎడమ కాల్వకు అనుసంధానంగా ఉన్న యూటీలలో పేరుకుపోయిన పూడిక తీత పనులను అధికారులు ప్రారంభించారు. రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం వద్ద ఉన్న యూటీల వద్ద వరద నీరు వెళ్లేందుకు పూడికతీత పనులు చేపట్టారు. చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం వద్ద ప్రధాన కాల్వపై ఉన్న వంతెనల వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడ ఏర్పాటు పనులు చేయనున్నారు.

కాల్వ కట్టలు కుంగిపోతున్నాయి


"సాగర్ ఎడమ కాల్వ కట్టలు కుంగిపోతున్నాయి. రామాపురం, చాకిరాల గ్రామాల వద్ద గతంలో పనులు నాసిరకంగా చేయడంతో కాల్వ కట్టల లైనింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మేజర్ కాల్వ పరిస్థితి కూడా మరీ అధ్వానంగా మారింది. మేజర్ కాల్వకు అనుసంధానంగా ఉన్న లోలెవెల్ కాల్వ అధ్వానంగా ఉండడంతో నీరు వృథాగా పోతోంది. పలు చోట్ల షెట్టర్‌లు బిగించలేదు.

– ఏనుగుల వీరాంజనేయులు రైతు, రామాపురం

చివరి భూములకు నీరందించాలి


"త్రిపురవరం, పాలారం, వల్లాపురం గ్రామాల చివరి భూములకు పాలారం మేజర్ కాల్వ నీరు రావడంలేదు. లక్షల రూపాయల వ్యయంతో ఆధునీకరణ పనులు చేసినా చివరి భూములకు నీరందడంలేదు. పలు చోట్ల లైనింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కాల్వల్లో నాచు పెరుగుతున్నది. పలు చోట్ల కాల్వలు పూడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి చివరి భూములకు నీరిందించాలి.

– వట్టికూటి వెంకన్న, రైతు వల్లాపురం

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

"ఈ ఏడాది సాగర్ కాల్వల ఆధునీకరణ పనులకు బడ్జెట్ లేదు. గత ఏడాది నిధులతోనే ప్రస్తుతం అత్యవసర పనులు చేపట్టాం. దెబ్బతిన్న ప్రధాన కాల్వ లైనింగ్‌ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే వచ్చే ఏడాది పనులు చేపడతాం.

– రఘు డీఈ, నీటి పారుదల శాఖ

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు


రామాపురంలో తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో తాగునీటి పైపులైన్లు లీకేజీ అయి నీరు వృథా అవుతుండటంతో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై గురువారం సాక్షి పత్రికలో 'పైపులైన్ల లీకేజీపై పట్టింపేదీ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ పాలకవర్గం స్పందించింది. గురువారం మిషన్ భగీరథ వారి సహకారంతో పైపులైన్ల లీకేజీ ఉన్న చోట మరమ్మతులు చేపట్టారు. అలాగే గేట్ వాల్వ్ ఏర్పాటు చేశారు. వీధులు వెంట నీరు పారకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు సర్పంచ్ మీసాల గంగా లింగయ్య తెలిపారు. సాక్షిలో కథనంతో పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ బలమైన నాయకుడిని కోల్పోయింది

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


బాలాజీ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు

చిలుకూరు : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదావత్ బాలాజీ అకాల మరణం బాధాకరమని, బాలాజీ మృతితో కాంగ్రెస్ ఒక బలమైన నాయకుడిని కోల్పోయిందని ఎంపీ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీత్లాతండా గ్రామంలో జరిగిన బాలాజీ అంతిమయాత్రలో ఉత్తమ్ పాల్గొని ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బాలాజీ మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బాలాజీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. బాలాజీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, కీత వెంకటేశ్వర్లు, బాల్‌రెడ్డి, పిండ్రాతి హనుమంతరావు, కొల్లు నాగయ్య, వెంకటేశ్వర్లు, హస్న, కొండా ప్రభాకర్, సొందుమియా, శ్రీను, కృష్ణ, నాగాచారి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శశిధర్‌రెడ్డి సంతాపం..

బాలాజీ మృతి పట్ల బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ శశిధర్‌రెడ్డి, ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, సర్పంచ్ ధీరావత్ మంగమ్మ సైదులు, ఉప సర్పంచ్ శంకర్ నాయక్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, సీపీఐ, టీడీపీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

సంకలమద్ది వెంకట్‌రెడ్డికి నివాళి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని కమలానగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సంకలమద్ది లీలామనుష్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం నిర్వహించిన దశదిన కర్మకు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై వెంకట్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, జితేందర్‌రెడ్డి, నాగయ్య, నాయకులు రంగనాథ్, రవీందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీను, వెంకట్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పాండునాయక్, శ్రీను, సైదానాయక్, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సికిందర్ గౌడ్ తదితరులున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం


వేలంలో పాల్గొన్న అధికారులు, పాలకవర్గం, రైతులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీవేణు గోపాలస్వామి దేవాలయ భూముల కౌలు వేలం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి చిటిప్రోలు వెంకటనారాయణ పర్యవేక్షణలో గురువారం సాయంత్రం స్థానిక ఆలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్ది హుస్సేన్‌రెడ్డి, ఈఓ ఎంపీ.లక్ష్మణ్‌రావులు మాట్లాడుతూ చౌటపల్లి రెవెన్యూ పరిధిలోని దేవాలయానికి సంబంధించిన 15 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన 10 మంది ఒక్కొక్కరు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారని చెప్పారు. కాగా పలువురు రైతులు 2023– 2024 సంవత్సరానికి గాను రూ. 2 లక్షల 30 వేల 800లకు భూమిని కౌలును దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు ఐ.వీరయ్య, పీ.వీరయ్య, జీ.గురువయ్య, వీరారెడ్డి, గోవిందరావు, నాగిరెడ్డి, నర్సిరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటప్పయ్య, ఆలయ సిబ్బంది గోవిందరెడ్డి, కిరణ్‌గౌడ్, అర్చకులు నరగిరినాథుని శ్రీనివాసాచార్యులు, రైతులు ఉన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం


క్రీడాకారులతో గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం నాయకులు, హెచ్‌ఎంలు

హుజూర్‌నగర్ : ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ శ్రీనివాస్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని వీవీఎం స్కూల్‌లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తి యొక్క శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించి మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్‌ఎంలు లతీఫ్, శ్రీమన్నారాయణ, రామకృష్ణ, చిరంజీవి, రాధాదుర్గ, మట్టారెడ్డి, శాంతిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుధాకర్‌రెడ్డి, పీడీ నాగమణి, పీఈటీలు బ్రహ్మారెడ్డి, మైసయ్య, ప్రదీప్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి క్రీడాకారులు ఉన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి


చిలుకూరు : బడిబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


నేరేడుచర్ల : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం బట్టు మధు

గరిడేపల్లి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే బడిబాట కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రణబోతు రవీందర్ కోరారు. గురువారం గరిడేపల్లిలో ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎలక సైదిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినప్పుడే బడుగు, బలహీన వర్గాల వారికి విద్యా సుగంధాలు అందుతాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి బసవ కోటేశ్వర్‌రావు, బాల సైదిరెడ్డి, రాంబాబు, వెంకట్‌రెడ్డి, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

బడిబాట పోస్టర్ ఆవిష్కరణ

చిలుకూరు : బడి బాట కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సర్పంచ్ మీసాల గంగా లింగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి అన్నారు. గురువారం రామాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో బడిబాట పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గిద్దె రామయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమ సన్నాహక సమావేశం

నేరేడుచర్ల : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం మండలంలోని దిర్శించర్ల ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టు మధు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పాటు పడుతున్న పలు అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కుంటిగొర్ల సైదులు, జొన్నలగడ్డ శ్రీను, కట్టా మాధవి, శ్రీనివాస్‌రావు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్ యాదగిరి, వెంకటకృష్ణ తదితరులున్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి


మఠంపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతీకొండానాయక్


నడిగూడెంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

మఠంపల్లి : మండల వ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఈనెల 2 నుంచి 22 వరకు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. 21 రోజుల పాటు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ జగన్‌నాయక్, స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, తహసీల్దార్ సాయాగౌడ్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో జరుపుకోవాలి

నడిగూడెం : ఈ నెల 2 నుంచి 22 వరకు మండల వ్యాప్తంగా నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలను ఒక ప్రత్యేక పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, పశువైద్యాధికారి మాదుపల్లి రవికుమార్, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసాని వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు


నేరేడుచర్లలో ముస్తాబైన వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

నేరేడుచర్ల : ఈ నెల 2వ తేదీ ప్రారంభం కానున్న తెలంగాణ అవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి నేరేడుచర్ల పోలీస్ స్టేషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

గీత కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న ఓరుగంటి పుల్లయ్య

హుజూర్‌నగర్‌రూరల్ : తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన హుజూర్‌నగర్ మండలంలోని లక్కవరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఓరుగంటి పుల్లయ్య (52) గురువారం సాయంత్రం గ్రామ శివారులో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఎడమ చేతికి, ఛాతిపై గాయాలయ్యాయి. స్థానికులు పుల్లయ్యను హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లింగస్వామికి నివాళి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన లింగస్వామి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ గురువారం లింగస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగస్వామికి అతి చిన్న వయస్సులోనే బీపీ పెరిగి బ్రెయిన్ డెడ్ కావడం బాధాకరమని అన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు కొండమీద గోవిందరావు, రాం సైదులు, రణపంగ సైదులు, నందిపాటి శ్రీనివాస్, వినోద్, మధు తదితరులున్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని పలు దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలకు చెందిన నమూనాలను సేకరించారు. జిల్లా ఆహార భద్రత, ప్రత్యేక తనిఖీ అధికారి కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ గొలుసుకట్టు ఉత్పత్తుల నమూనాలను సేకరించినట్లు తెలిపారు. వీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో అధికారులు కృష్ణమూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు నిప్పు

- పొగతో ఇబ్బందులు పడుతున్న పరిసర ప్రాంత ప్రజలు


బట్టువానికుంటలో కాలుతున్న డంపింగ్ యార్డు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని బట్టువానికుంటలో గల చెత్త డంపింగ్ యార్డుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో పరిసర ప్రాంతాలను దట్టమైన పొగ అలుముకుంది. డంపింగ్ యార్డు పక్కనే ఉన్న బట్టువానికుంటలోని ఇళ్లను పొగ కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ కోదమగుండ్ల సరిత మాట్లాడుతూ బట్టువానికుంటలో ఇళ్లకు ఆనుకొని డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో ఈగలు, దోమలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ప్రస్తుతం డంపింగ్ యార్డ్‌కు నిప్పు అంటించడంతో పొగతో నానా అవస్థలు పడుతున్నారన్నారు. గ్రామానికి ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు నేతల పరామర్శ


ఉపేందర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


ఉదయలక్ష్మి మృతదేహానికి నివాళులర్పిస్తున్న శశిధర్‌రెడ్డి, నాయకులు

కోదాడ : పట్టణంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను గురువారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ శశిధర్‌రెడ్డిలు పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుడు రాయపూడి వెంకటనారాయణ తల్లి ఉదయలక్ష్మి బుధవారం మృతి చెందారు. గురువారం మల్లయ్యయాదవ్, శశిధర్‌రెడ్డిలు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇటీవల వడదెబ్బకు గురై మరణించిన నాళం ఉపేందర్ కుటుంబసభ్యులను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పరామర్శించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై గ్రామ పంచాయతీ కొరడా


అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది

మఠంపల్లి : మండలంలోని పెదవీడులో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై గ్రామ పంచాయతీ కొరడా ఝులిపించింది. కోర్టు వివాదంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు పిల్లర్స్ వేయడంతో గురువారం స్థానిక గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పోలీసులతో కలిసి అడ్డుకున్నారు. ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలాల సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఎవరు ఆక్రమించిన చర్యలు ఉంటాయని సర్పంచ్ సయ్యద్ బీబీ కుతుబ్, కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ఇరుగు రవి, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.